# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :15 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: ఆదివారం 09-03-2025 పేజీలు:4 వెల: 2.00


## స్థానిక సమస్యలపై సమరం.. సత్వర పరిష్కారాని కృషి

చార్మినార్, మార్చి 8: స్థానిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని బహదూర్‌పుర నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పులిపాటి రాజేశ్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దూద్ బౌలి, అలియాబాద్ గంగపుత్ర సంఘం ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధిలో వర్గ, మత సంబంధాలు లేకుండా సమ ప్రధాన్యాతతో సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అలియాబాద్ పరిసర ప్రాంతాల్లో కొన్ని చోట్ల చాలా కాలంగా తిష్టవేసిన స్థానిక సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. స్థానిక సమస్యలపై అధికారులతో చర్చిస్తానని వెల్లడించారు. అదే సమయంలో స్థానికంగా గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను సైతం పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో అలియబాద్ గంగాపుత్ర సంఘం ప్రతినిధులు శ్రీ దార్పాలీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి పల్లెలా పుర్షోతం,ఉపాధ్యక్షుడు ఆనందేశి ప్రవీణ్,ఆనందేశి అర్జున్ కుమార్, గుంటి బసంత్ రావు,ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఎ వి జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

## ఆ బస్సులకు సకాలంలో కిరాయి చెల్లిస్తారా?: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయకపోవడంతో మహిళలు రాజకీయంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని జనగణనతో ముడిపెట్టి కేంద్రం ఇప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు అమలుకానందు వల్ల మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యాన వంటి ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో మహిళలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. జనగణనకు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించ లేదని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనగణన త్వరగా పూర్తిచేస్తే.. రాబోయే బీహార్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలుగా అవుతారన్నారు. ప్రతీ మహిళకు రూ.2500 ఇస్తామన్న హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా కిరాయికి తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందో లేదో స్పష్టత ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకపో వడం సరికాదని విమర్శించారు. మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ మహిళా కేంద్రీకృత పాలన చేశారని వెల్లడించారు. మహిళల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. కేసీఆర్ పెట్టిన పథకాలను తీసేసే కర్కోటక ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో మహిళా, పురుషుల సమానత్వపు బొమ్మలు ప్రచురిస్తున్నారని వెల్లడించారు. అలాంటి చర్యలు తెలంగాణలో కూడా రావాల్సి ఉందన్నా రు. 'సమాజం ఎదుగుదలలో మహిళల పాత్ర గణనీయం. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు సమాన హక్కులు, గౌరవం, నిర్ణయాధికారం రావాల్సి ఉంది. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. చిట్యాల ఐలమ్మ, రాణి రుద్రమాదేవి వంటి వీర మహిళలు తెలంగాణ గడ్డపై పుట్టడం మనకు గర్వకారణం. మహిళలకు కులమతాలు లేవు.. మహిళలది ఒకే కులం. మహి ళలలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలి. ఇళ్లలో మహిళలు ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉంటున్నారన్న వాదన వీగిపోవాలి.అమెరికాలో 40 శాతం మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే, భారత్‌లో మాత్రం అది 17 శాతంగానే ఉంది. దేశంలో 50 శాతం మహిళలు ఉద్యగాలు చేస్తే దేశ జీడీపీకి మనం 5 లక్షల కోట్ల ఆదా యం ఇవ్వగలుగుతాం. కానీ మహిళలు ఉద్యోగాలు చేయద గడానికి గల సౌకర్యాలు ఉన్నాయా అన్నది ఆలోచించాలి. భూగర్భ గనులల్లో పనిచేయడం నుంచి అంతరిక్షంలోకి వెళ్లే వరకు మహిళలు ఎదిగారు. అయినా అనేక అవాంతరాలు ఉన్నాయి. వాటిని అధిగమించాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు.

## రెస్క్యూ ఆపరేషన్ లో రోబోలు.. మంత్రి ఉత్తమ్


అచ్చంపేట, ఫిబ్రవరి 8: భారతదేశ చరిత్రలో ఇప్పటి వరకు ఇంత భారీ స్థాయిలో విపత్తును చూడలేదని, ఎస్ ఎల్ బి సి టన్నెల్లో సంభవించిన విపత్తులో సహాయక చర్యలను, రెస్క్యూ ఆపరేషన్ ను భారత సైన్యం పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్నదని తెలంగాణ రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన దోమలపెంటలోని ఎస్ ఎల్ బి సి టన్నెల్ ను సందర్శించారు. రెస్క్యూ ఆపరేషన్ లో తీసుకుంటున్న సహాయక చర్యలను అధికారులు ఆయనకు నమూనా టన్నెల్ బోర్ మిషన్ ద్వారా వివరి ంచిన అనంతరం టన్నెల్లోకి వెళ్లి పరిశీలించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో ఇప్పటి వరకు ఇంతటి భయంకరమైన విపత్తు సంభవించలేదని, కార్మికులను రక్షించడానికి జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, 12 జాతీయ సంస్థలు ఈ రెస్క్యూ ఆపరేషన్ లో పాల్గొంటున్నాయని తెలిపారు. 14 కిలోమీటర్లలో సంభవించిన దుర్ఘటన ప్రాంతానికి 50 మీటర్ల దగ్గర భారీగా ఆక్సిజన్ స్థాయిలు పడిపోతున్నందున రెస్క్యూ ఆపరేషన్ క్లిష్టతరంగా మారిందని, రెస్క్యూ టీం సభ్యులకు ప్రాణాపాయం పొంచి ఉన్నందున ఆదివారం నుండి రోబోలను సహాయక చర్యలలో భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. శనివారం సుమారు 525 మంది సిబ్బంది ఈ రెస్క్యూ ఆపరేషన్ లో పాల్గొన్నారు తెలిపారు. శుక్రవారం కేరళ నుంచి వచ్చిన కేడోవర్ డాగ్స్ ముగ్గురు కార్మికుల ఆనవాళ్లను అనుమానించగా అక్కడ రాట్ హోల్ మైనస్ తవ్వకాలు చేపడుతున్నారని



తెలిపారు.నేటి వరకు భారతదేశ చరిత్రలో ఇంతటి విపత్కర పరిస్థితి సంభవించలేదని, ఇక్కడికి వచ్చిన నిపుణులు సైతం పేర్కొంటున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో అనునిత్యం చర్చిస్తూ ఈ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, త్వరలోనే ఆపరేషన్ ను పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. టన్నెల్లో చిక్కుపోయిన కార్మికులు ఇక జీవించలేరని, కచ్చితంగా నిర్ధారణకు వచ్చినట్లయితే వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆమోదయోగ్యమైన పరిహారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్నల్ పరీక్షిత్ మేహర, డిజాస్టర్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భారత్ ఎదుగుదలలో మహిళలే కీలకం కావాలి..

హైదరాబాద్,హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఉమెన్స్ డే సెలబ్రేషన్స్ చేశారు. మహిళా దినోత్సవ సంబరాలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర సంస్థగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. మహిళందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పూజించే గోవును కూడా గోమాత అంటారని అన్నారు. మహిళల సాధికారతపై ప్రాధాన్యత పెరగాలని చెప్పారు.వికసిత భారత్ మోడీ లక్ష్యం.. అభివృద్ధి చెందిన భారత్‌గా తీర్చి దిద్దడమే మోడీ విజన్ అని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. భారత్ ఎదుగుదలలో మహిళలే కీలకం కావాలని అన్నారు. భారత్ ఆర్థిక అభివృద్ధిలో మహిళా అమ్మ పాత్ర పోసించాలన్న దే మోడీ ఆలోచన అని తెలిపారు. 64 కోట్ల మంది హిందువులు కుంభమేళాలో పాల్గొని.. కుహానా మేధావుల కళ్ళు తెరిపించి, సనాతన ధర్మం గురించి చాటి చెప్పారని వెల్లడించారు. సనాతన ధర్మానికి గొప్ప చరిత్ర ఉంది.. పాశ్చాత్య సంస్కృతి వల్ల మన సనాతన సాంప్రదాయాలను మర్చిపోతు న్నామని వ్యాఖ్యానించారు. సనాతన సంప్రదాయాలని కాపాడుకోవా ల్సిన బాధ్యత ప్రతి మహిళా మీద ఉందని లక్ష్మణ్ చెప్పారు.మహిళా ఆర్థిక అభివృద్ధికి మోడీ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని లక్ష్మణ్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా, ఆలోచనల పరంగా అభివృద్ధి కావాలి.. దేశానికి రాష్ట్రపతి, ఢిల్లీకి ముఖ్యమంత్రి మహిళేనని



అన్నారు. మహిళా బిల్లుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రాష్ట్రంలో కల్లబొల్లి మాటలు చెప్పి రేవంత్ అధికారంలోకి వచ్చారు.. ఇచ్చిన హామీలన్నీ నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది అనడానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాక్ష్యం అని పేర్కొన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు ఉంటేనే అభివృద్ధి జరుగుతోంది.. తెలంగాణలో మహిళా శక్తితో బీజేపీ అధికారంలోకి రాబోతోంది.. రేవంత్ సర్కార్ ను కూకటి వేళ్ళతో పెకలించ దానికి తెలంగాణలో మహిళా శక్తి సిద్ధం కావాలని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు.

## వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులో వస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి



హైదరాబాద్,మార్చి8:వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను శనివారం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కలిశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు కొండా సురేఖ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులు చేయాల్సిన కార్యక్రమాల గురించి అరగంటకు పైగా తమతో చర్చించి సానుకూలంగా స్పందించారని అన్నారు. వరంగల్‌కు సంబంధించి తాము అడిగిన సమస్యలతో పాటు వరంగల్ రింగ్ రోడ్డుకు కృషి చేస్తామని అశ్విని వైష్ణవ్ స్వయంగా ఒప్పుకున్నారని చెప్పారు. ఈ సందర్భగా అశ్విని వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాజీపేట డివిజన్ వేరుగా ఏర్పాటు చేయాలని కోరామన్నారు. డోర్నకల్ భద్రాచలం రైల్వే లైన్ ఉంది కానీ బ్రిడ్జి పూర్తి కాలేదని.. దానిపై విజ్ఞప్తి చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్నటువంటి బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు కూడా ఇక్కడి సమస్యలపై వినతి పత్రాలు అందజేశామని గుర్తుచేశా రు. ఏపీలో ఐదు డివిజన్లు ఉన్నాయని... హైదరాబాద్ తర్వాత పెద్ద మహానగరం వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ వచ్చిందని తెలిపారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్‌ను ఎవరో వచ్చి తామిచ్చామని చెప్పుకుంటే పర్వాలేదన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్ అభివృద్ధి చేస్తామని మాటలతో కోటలు కట్టింది కానీ తప్ప ఏం చేయలేదని మండిపడ్డారు.

వరంగల్‌కు ఇండస్ట్రీస్ రాలేదు రా వాల్సినటువంటి ఎయిర్‌పోర్ట్ ఎప్పుడో రావాల్సి ఉన్నా ఇంకా రాలేదని చెప్పారు. తమ అందరి కృషితో రైల్వే లైన్ల విస్తరణ ఏర్పాట్లు సాధించుకుందామని అన్నారు. చాలా కాలంగా ప్రజలకు ఉపయోగపడే పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అన్నింటిని అభివృద్ధి చేసుకునే విధంగా ఇందిరమ్మ ప్రభుత్వంలో తామంతా పనిచేస్తున్నామని తెలిపారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్‌తో సహా తదితర అంశాలపై విజ్ఞప్తి చేశామన్నారు. వాటన్నిటిపై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. బీజేపీలో గెలిచిన కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రాష్ట్రం గురించి ఏం పట్టనట్టుగా ఉండటం బాధాకరమని చెప్పారు. ఇకనుంచి అయినా పార్టీలను పక్కనపెట్టి అం దరం అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి పనులకు బీజేపీ నేతలు సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి వరంగల్‌ను అతిపెద్ద రెండో రాజధానిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయాలనుకు ంటున్నారని అన్నారు.వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ కళా సాకారం అవుతున్న వేల దానికి అనుగుణంగా రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వరంగల్ ఓఆర్ఆర్ చుట్టూ రైల్వే సదుపాయాన్ని ఇవ్వడంతో పాటు చింతనపల్లిలో ఉన్న కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు కావలసిన విధంగా రైలు మార్గాలను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కోరామని చెప్పారు. వెంటనే స్పందించిన అశ్విని వైష్ణవ్ రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారని మంత్రి కొండా సురేఖ అన్నారు. పాండురంగాపురం – మల్కాన్ గిరి రైల్వే లైన్ మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్విన్ వైష్ణవ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజతలు తెలిపారు. పాండురంగాపురం – మల్కాన్ గిరి రైల్వే లైన్ ను సారపాక (భద్రాచలం)వరకు వెంటనే పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని లేఖ ద్వారా మంత్రి తుమ్మల కోరారు. సత్తుపల్లి నుంచి కొవ్వూరు,పెనుబల్లి నుంచి కొండపల్లి వరకు కొత్త రైల్వే లైన్లు మంజూరు చేయాలని లేఖలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## మహిళలు శక్తి స్వరూపాలు..



హైదరాబాద్,అమ్మవారి శక్తి స్వరూపాలు సృష్టికి మూల కారకులు కుటుంబాన్ని, సమాజాన్ని కంటికి పాపలా కాపాడుతున్న స్త్రీ మూర్తులందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.సృష్టిలో ఏమీ ఆశించకుండా పిల్లల ఎదుగుదలకు జీవితాన్నే త్యాగం చేసేది తల్లి మాత్రమే.. అక్కా చెల్లెళ్ల రూపంలో, భార్యగా తోడునీడగా నిలిచేది స్త్రీ మూర్తులే.. ఒక్క మాటలో చెప్పాలంటే స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదని బండి సంజయ్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం నాడు మాత్రమే మహిళలను పొగిడి ఆ తరువాత వారిని విస్మరించే పార్టీ బీజేపీ కానేకాదని అన్నారు. స్త్రీలను లక్ష్మీ, సరస్వతి, దుర్గామాతగా పూజించే పార్టీ బీజేపీ అని తెలిపారు. ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్మును ఈ దేశ ప్రథమ పౌరురాలిగా చేసిన పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. ఏ మహిళల చేతిలో డబ్బు ఉందో ఆ కుటుంబం, ఆ దేశం సురక్షితంగా, ప్రగతి పథంలో నడుస్తుందని నమ్మి ఆచరిస్తున్న వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని తెలిపారు. మహిళకు ఆర్థిక మంత్రి పగ్గాలు అప్పగించడంతో పాటు కేంద్ర కేబినెట్‌లో, ప్రభుత్వ పదవుల్లో సముచిత భాగస్వామ్యం కల్పించారని బండి సంజయ్ వెల్లడించారు.దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లను కట్టించి మహిళల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇంటి తాళాలు అప్పగించడంతోపాటు.. మరో 3 కోట్ల ఇండ్లను నిర్మించి మహిళలకు అందజేసేందుకు సిద్ధమైన నాయకుడు మోదీ అని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. మహిళల పేరుతో 8 కోట్ల కుటుంబాలకు నల్లా కనక్షన్లు, 25 కోట్ల మంది స్త్రీలకు జన్ ధన్ బ్యాంక్ అకౌంట్లు, దాదాపు 25 కోట్ల మంది మహిళలకు 10 లక్షల కోట్ల రూపాయలను ప్రధాన మంత్రి ముద్రా యోజన కింద ఎలాంటి పూచికత్తు లేకుండా రుణాలిచ్చి.. అక్కా చెల్లెళ్లు ఎవరిపైనా ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడేలా చేస్తూ "మహిళా శక్తి"కి అసలైన నిర్వచనం చెబుతూ మహిళా సాధికారత అంటే ఏమిటో చేతల్లో చూపుతున్న మహనీయుడు అని పొగిడారు. దేశంలోని 11 కోట్ల మంది ఉజ్వల కనెక్షన్లు అందించి కట్టెల పొయ్యి బాధ లేకుండా చేసి మహిళల కంట కన్నీరు తుడిచింది మోదీ అని పేర్కొన్నారు. బేటీ బచావో - బేటి బచావో, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన వంటి పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నారని బండి సంజయ్ తెలిపారు.'మహిళా శక్తి' అంటే మహిళా దినోత్సవం నాడే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి.. పత్రికల్లో, టీవీల్లో పెద్ద పెద్ద ప్రకటనలిస్తూ ప్రచారం చేసుకోవడం కాదని బండి సంజయ్ అన్నారు. ఆచరణలో చూపాలి.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు ప్రతినెలా రూ.2500లు ఇస్తామన్నారు.. 15 నెలలైనా నయాపైసా ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రతి మహిళకు తులం బంగారం, స్కూటీ ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి తగిన నిధులు ఖర్చు చేయడం లేదు.. మద్యం ఏరులై పారి మహిళల జీవితాలు ఛిద్రమవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వస్తే బెల్టు షాపులు లేకుండా చేస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేలా చేయకుండా మహిళా దినోత్సవం నాడు మాత్రమే 'మహిళలను శక్తి'గా మారుస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు, పెద్ద పెద్ద ప్రకటనలు, హోర్డింగ్స్, ఫెక్సీలు, సభలు, సమావేశాలు పెడితే నమ్మేదెవరు..? అని విమర్శించారు. రాణిరుద్రమదేవి వారసత్వం పుణికి పుచ్చుకున్న తెలంగాణ మహిళలు చైతన్యవంతులు అని అన్నారు.మాటలతో మభ్యపెట్టే పాలకులకు, పార్టీలకు సమయం రాగానే కర్రు కాల్చివాత పెట్టడం తథ్యం అని పేర్కొన్నారు.

### కాల్వలో పడ్డ కారు.. కుమారుడు మృతి, తండ్రి, కుమార్తె గల్లంతు

వరంగల్: ఎస్సారెస్పీ కాల్వలోకి కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కుమారుడు మృతిచెందగా.. తండ్రి, కుమార్తె గల్లంతయ్యారు. కాల్వలో కొట్టుకుపోతున్న తల్లిని స్థానికులు కాపాడారు. వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. గల్లంతైన తండ్రి, కుమార్తె కోసం గాలింపు కొనసాగుతోంది.వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మేచరాజుపల్లికి చెందిన సోమారపు ప్రవీణ్ తన భార్య కృష్ణవేణి, కుమార్తె చైత్ర సాయి, కుమారుడు ఆర్య వర్ధన్ సాయితో కలిసి హనుమకొండ నుంచి స్వగ్రామానికి కారులో

## కర్నాటక హంపిలో దారుణం..విదేశీ టూరిస్ట్‌పై గ్యాంగ్ రేప్

బెంగళూరు,మార్చి8: భారత్ సందర్శనకు వస్తున్న టూరిస్ట్ లు మన అతిథులు.. వారిని గౌరవించాలనే విచక్షణ మరిచి కొందరు దుండగులు దాడులకు దిగుతున్నారు. డబ్బులు వసూలు చేయడం, గొడవలు పెట్టుకోవడమే కాకుండా చివరికి అత్యాచారం చేసేవరకు తెగిస్తున్నారు. తాజాగా కర్ణాటకలో జరిగిన గ్యాంగ్ రేప్ సంచలనం సృష్టించింది. కర్ణాటకలో ఇజ్రాయెల్ టూరిస్ట్ (27) తో పాటు ఆమె అద్దెకు ఉంటున్న ఇంటి ఓనర్ (29) ను గ్యాంగ్ రేప్ చేశారు దుండగులు. గురువారం రాత్రి కర్ణాటకలోని హంపీలో ఈ దారుణ ఘటన జరిగింది. వీళ్లతో పాటు వచ్చిన ముగ్గురు పురుషులపై కూడా దాడులు చేసి పక్కనే ఉన్న కాలువలో పడేశారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. హంపీకి 4 కిలోమీటర్ల దూరంలో పర్యాటకులు ఎక్కువగా వస్తుండే సనాపూర్ చెరువు దగ్గర ఈ ఘటన జరిగింది. ఇజ్రాయెల్ మహిళా టూరిస్ట్ తో పాటు ఒడిషా, మహారాష్ట్ర, అమెరికాకు చెందిన ముగ్గురు పురుష పర్యాటకులపై దుండగులు దాడులు చేశారు . బైక్ పై వచ్చిన ముగ్గురు దుండగులు పెట్రోల్ బంక్ కు ఎటు వెళ్లాలని టూరిస్టులను అడిగారు. ఈ దగ్గరల్లో బంక్ లేదని చెప్పడంతో.. పెట్రోల్ కు డబ్బులు ఇవ్వాలని అడిగారు. 20 రూపాయలు ఇవ్వడంతో ఎక్కువ మొత్తంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడ్డొచ్చిన పురుష టూరిస్ట్ లను కొట్టి కాలువలో పడేశారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ టూరిస్ట్ తో పాటు ఇంటి ఓనర్ ను గ్యాంగ్ రేప్ చేశారు. శుక్రవారం ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.. టూరిస్టులు చెప్పిన వివరాల ప్రకారం దుండగులు స్థానికులు. కన్నడం, తెలుగు మాట్లాడుతున్నారు..' అని సీనియర్ పోలీసు అధికారి లోకేశ్ కుమార్ తెలిపారు. కాలువలో పడిన టూరిస్టులలో ఇద్దరు కాసేపటికి బయటికి రాగలిగారు. కానీ అందులో ఒకరు మాత్రం రాలేకపోయాడు. శుక్రవారం ఉదయం పోలీసులు కాలువలోనే ఉండిపోయిన టూరిస్ట్ బాడీని వెలికి తీశారు. టూరిస్టులందరికీ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పర్యటన



కోసం వచ్చిన అతిథులపై ఇంతటి దారుణానికి ఒడిగట్టిన దుండగుల కోసం వెదుకుతున్నారు. పోలీసులు. స్పెషల్ డాగ్ స్క్వాడ్ లను రంగంలోకి దించారు. మరో టీం అనుమానితులను విచారించే పనిలో ఉంది. ప్రభుత్వం కూడా ఈ ఘటనను సీరియస్ గా తీసుకుంది. రాష్ట్ర, దేశ పరువు తీసేలా వ్యవహరించిన దుండగులను కఠినంగా శిక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

### అట్టహాసంగా ప్రాపర్టీషో ప్రారంభం

నిజామాబాద్,జిల్లా కేంద్రంలోని వేణుమాల్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షో అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి , బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, నమస్తే తెలంగాణ ప్రకటనల విభాగం జనరల్ మేనేజర్ ఎన్. సురేందర్ రావు హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒకే గొడుగు కిందకు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులను, బ్యాంకర్లను, బిల్డర్స్ అండ్ డెవలపర్స్‌లను తీసుకురావడం మంచి ప్రయత్నం అని అభినందించారు. ప్రాపర్టీ షో నాలుగో ఎడిషన్ కార్యక్రమాన్ని నిజామాబాద్‌లో నమస్తే తెలంగాణ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, బిగాల

## సంపాదకీయం

ఆదివారం 09-03-2025

# హిందీ వివాదం...

కేంద్రంపై హిందీవాదుల పెత్తనం స్వాతం త్ర్యం వచ్చిన రోజుల నుంచీ ఉన్నది. ఆ పెత్తనంపై పోరాటం సాగించిన చరిత్ర తమిళనాడుకు అంతకుముందు నుంచీ ఉన్నది. ద్రవిడ ఉద్యమ నేపథ్యం దీనికి దోహదం చేసింది. అనేక సందర్భాల్లో హిందీ వ్యతిరేక ఆందోళనలు తమిళనాడు అంతటా భీకరంగా జరిగాయి. 1937లోనే మద్రాస్ ప్రెసిడెన్సీలో రాజాజీ సర్కారు హిందీని స్కూళ్లలో తప్పనిసరిగా బోధించాలనే నియమం తెచ్చినప్పుడు తీవ్రస్థాయిలో ఆందోళనలు మొదలయ్యాయి. ఆ సందర్భంగా ఇద్దరు విద్యార్థుల బలిదానం గురించి ఇప్పటికీ తమిళనాడులో చెప్పుకొంటారు. ప్రజావ్యతిరేకత నేపథ్యంలో రాజాజీ రాజీనామా చేయడంతో బ్రిటిష్ ప్రభుత్వం హిందీ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నది. ఆ తర్వాతికాలం లో హిందీ వ్యతిరేకత అనేది తమిళనాడు సం స్కృతిలో భాగమైంది. తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎం.కరుణానిధి హిందీ వ్యతిరేక ఆందోళనల్లో అరెస్టయి కేసులు ఎదుర్కొన్న సందర్భాలూ ఉన్నాయి.రైల్వేస్టేషన్లు, తదితర స్థలాల్లో హిందీ రాతలను ఆందోళనకారులు చెరిపేయడం ఈ ఉద్యమాలకు ప్రతీకాత్మకంగా నిలుస్తుంది. తాజాగా మరోసారి తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళనలు మిన్నంటుతున్నాయి. ఈసారి కేంద్ర-రాష్ట్ర తగాదాకు నూతన విద్యావిధానం (2020) కేంద్ర బిందువుగా మారింది. కేంద్రానికి, తమిళనాడుకు మ ధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరుతున్నది. ప్రభుత్వ పాఠశాల్లో మూడు భాషలు బోధించాలన్న నియమాన్ని అమలుచేయకపోతే సమగ్ర శిక్షా అభియాన్ కింద తాము ఇచ్చే నిధులను వదులుకోవాల్సి వస్తుందని కేంద్రం తేల్చిచెప్పడం ఇందుకు కారణం. అయితే తమిళనాడు మాత్రం హిందీకి ససేమిరా అంటూ తన ద్విభాషా సూత్రాన్ని యథావిధిగా అమలు చేస్తున్నది. ఈ వివాదంపై రాజ్యాంగం వైఖరి కొంత స్పష్టతకు తావిస్తున్నది. హిందీ అధికార భాష అని అందులో ఉంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 15 ఏండ్ల వరకు ఇంగ్లిష్ అధికార భాషగా కొనసాగుతుందని వెసులుబాటు కల్పించారు. అయితే ఆ గడువు ముగిసేలోపే 1963లో తెచ్చిన అధికార భాషల చట్టంలో హిందీతో పాటుగా అదనంగా ఇంగ్లిష్ అధికార వ్యవహారాలకు, అదీ నిరవధికంగా, వినియోగించబడుతుందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్రంలోని భాషలో దేనినైనా లేదా హిందీని అధికార వ్యవహారాలకు వినియోగించవచ్చని స్వేచ్ఛను కల్పించింది. అదే సమయంలో భారతదేశ మిశ్రమ సంస్కృతిలో ఏక సూత్రత తెచ్చేందుకు హిందీని ప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా ఉంటుందని కూడా రా జ్యాంగం స్పష్టం చేసింది. ఈ బాధ్యతలో భాగంగా కేంద్రం 1968లో మొదటిసారిగా త్రిభాషా సూత్రంతో నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. ఆ ఏడాదే పార్లమెంట్ ఉభయసభలు అధికార భాషా తీర్మానాన్ని ఆమోదించాయి. ఆ రెండింటి ప్రకారం హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాల్లో హిందీ తప్పనిసరిగా బోధించాలనే నియమం తెచ్చారు. దీనిపై తమిళనాడులో నిరసనలు భగ్గుమన్నాయి. ద్రవిడ పార్టీల సుస్థిర పాలనలో ఆ రాష్ట్రంలో ద్విభాషా సూత్రమే అమలవుతున్నది. 1980ల మధ్యలో కూడా భీకర స్థాయిలో హిందీ వ్యతిరేక ఆందోళనలు రాజుకున్నాయి. ఈ నేపథ్యంలో 2020లో కేంద్రంలోని ఎన్డీయే సర్కారు నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే అందులో హిందీ తప్పనిసరి అనకుండా మూడు భాషల్లో రెండు స్వదేశీ భాషలైతే చాలునని సడలింపు ఇచ్చింది. ఇంగ్లిష్ స్వదేశీ భాష కానప్పటికీ అది అంతర్జాతీయంగా వివిధ సేవారంగాల్లో పోటీ పడేందుకు తోడ్పడుతుందనేది తెలిసిందే. అందుకే తమిళనాడు తమిళం, ఇంగ్లిష్ బోధనను తప్పనిసరిగా అమలు చేస్తూ తమ సిద్ధాంతాలకు అనుగుణంగా హిందీని ప్రతిఘటిస్తూ వస్తున్నది. 2020 ఎన్ఈపీలో హిందీ గురించి నొక్కి చెప్పనప్పటికీ లోపాయికారిగా సంస్కృతాన్ని ప్రోత్సహించడం తమిళనాడుకు నచ్చని అంశంగా ముందుకు వచ్చింది. అంతేకాకుండా కేంద్రం ఎస్ఎస్ఏ కింద ఇవ్వాల్సిన రూ.2 వేల కోట్ల నిధులను ఆపివేయడంతో మరోసారి తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళనలు మొ దలయ్యాయి.దొడ్డిదారిన హిందీని, సంస్కృతాన్ని రుద్దేందుకే కేంద్రం త్రిభాషా సూత్రం ఒత్తిడి తెస్తున్నదనేది తమిళనాడు వాదన. త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు ప్రతిఘటించడం రాజ్యాంగ విరుద్ధమని కేంద్రం అంటున్నది. అయితే రాజ్యాంగంలో ఆ సంగతి ఎక్కడుందో చెప్పాలని తమిళనాడు కేంద్రాన్ని నిలదీస్తున్నది. ఉత్తరాదిన దక్షిణాది భాష ఏదైనా బోధిస్తున్నారా? అని తమిళ సీఎం స్టాలిన్ తాజాగా సవాల్ విసిరారు. హిందీ వివాదం అంతిమంగా సమాఖ్యవాదానికి సవాలుగా పరిణమిస్తున్నదన్న సంగతి గుర్తుంచుకోవాలి.

# పునర్విభజనపై పునరాలోచన

న్యూఢిల్లీ,భారత దేశం అనేక సంస్కృతులు, భాషలు, మతాలు కలిపిన మిశ్రమ దేశం. 'భారత దేశం అంతా ఒక్కటిగా ఉంటుంది' అనే భావన ప్రాచీన కాలం నుంచీ కొనసాగుతున్నది. మన దేశం గొప్పదని, కశ్మీర్ టూ కన్యాకుమారి (ఉత్తరాన్నించి దక్షిణం వరకు) ప్రతి భారతీయుడు ఒక్కటిగా ఉంటారని గర్వంగా చెప్పుకుంటాడు. భరతమాత ముద్దు బిడ్డలమని ప్రతి ఒక్కరూ గౌరవంగా భావిస్తారు. ఇది భారతదేశంలోని అంతర రాష్ట్ర అనుబంధాన్ని, సామరస్యాన్ని చాటుతుంది. కానీ రాజకీయాలు ఈ అందమైన భావనకు ప్రతికూలంగా మారుతున్నాయా? అని చర్చ జరుగుతోంది. భారత్‌లో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య క్రమంగా పెరిగిపోతున్న వివక్ష, రాజకీయ వర్గాల మధ్య అసమానతలు, సామాజిక శక్తి సామరస్యాన్ని భంగం చేయడంలో ఎంతగానో పాత్ర పోషిస్తున్నాయి. 8 దశాబ్దాల స్వాతంత్ర్య పోరాటం తర్వాత, ఎక్కువ మంది ఉత్తరాదివారు ప్రధాని పదవిని ఎప్పటికప్పుడు ఆక్రమించుకున్నారు. కానీ దక్షిణాది ప్రాంతం నుండి మాత్రం పివి నరసింహారావు, దేవెగౌడ వంటి ఇద్దరు ప్రధానులు మాత్రమే వచ్చిన సంగతి మనకు తెలుసు. భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టబోతున్నారు. ఈ ప్రక్రియ 2026లో అమలవుతుంది. ఇందులో పార్లమెంట్ సీట్ల సంఖ్య పెరిగిపోతుంది. అయితే, ఈ సీట్లు పెరిగేటప్పుడు దక్షిణాదికి తీరని అన్యాయం జరిగే అవకాశం ఉందని మేధావులు, ప్రజాస్వామ్యప్రియులు భావిస్తున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ జనాభా ప్రాతిపదికన చేపట్టబడుతోంది. దీనితో దక్షిణాది రాష్ట్రాలకు కొత్త ఎంపి సీట్లు సాధించడంలో కఠినతరం అవుతుందని చెప్పబడుతోంది. డీలిమిటేషన్ ప్రక్రియలో కొత్త ఎంపి సీట్లు జనాభా ప్రాతిపదికన కేటాయించబడతాయి. దక్షిణాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించడంలో ముందంజలో ఉన్నాయి. వీటిలో మౌలిక విధానాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో అధిక మెరుగుదలతో, ఉత్తరాది రాష్ట్రాల కంటే ఎంతో ముందుంది. కానీ, ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ఆధారంగా, దక్షిణాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు లభించకపోవడం, అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాలలో సీట్లు పెరిగిపోవడం ప్రతికూలతలను సృష్టిస్తుంది. ప్రస్తుత డీలిమిటేషన్ ప్రక్రియ జనాభా ఆధారంగా పార్లమెంట్ సీట్ల కేటాయింపును తిరిగి ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రక్రియను ముందే అంచనా వేసి, రెండు సంవత్సరాల క్రితం బిజెపి పాలకులు పార్లమెంట్ కొత్తభవనం నిర్మాణం ప్రారంభించారు. ఇందులో మొత్తం 888 సీట్ల పరిమాణం తో కొత్త భవనం నిర్మాణం చేపడుతూ పార్టీ తమ రాజకీయ లౌక్యాన్ని ప్రదర్శించడంలో పాల్గొన్నారని భావిస్తున్నారు. ఇది పలు ప్రశ్నల్ని కలిగిస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పార్లమెంట్‌లో మొత్తం 547 సీట్ల స్థానంలో 846 సీట్లు ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రక్రియలో ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించడం జాతీయ రాజకీయ వ్యవస్థలో కాంట్రవర్సీని కలిగిస్తోంది. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు భారీ సంఖ్య లో సీట్లు పొందబోతున్నాయి. ఉదాహరణకు ఉత్తరప్రదేశుకు 80 నుంచి 122 సీట్లు, బీహార్‌కు 40 నుంచి 70 సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఇక, దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల చాలా తక్కువగా ఉంటుందని అంచనా. తెలంగాణకు 17 -20, ఆంధ్రప్రదేశుకు 25 -28, తమిళనాడుకు 39- 41, కేరళకు 20- 19 సీట్లు తగ్గే అవకాశం ఉంది. ఈ పరిణామంలో, ఉత్తరాది రాష్ట్రాల ప్రభావం పెరిగిపోతుండగా, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగడం మొదలవుతుంది. ఈ పరిస్థితి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన రాజకీయ శక్తిని పెంచి, దక్షిణాది రాష్ట్రాల శక్తిని బలహీనపరుస్తుంది. ఇది శాశ్వతంగా ఉత్తరాది ఆధిపత్యాన్ని నెలకొల్పే ప్రమాదాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్యవాదులు ఈ పరిణామాన్ని అంగీకరించలేకపోతున్నారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వంలో డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు, దీనిని వాయిదా వేసింది. ఆమె భావన ప్రకారం, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి. ఇక్కడ జనాభా నియంత్రణకు కీలకమైన నిర్ణయాలు తీసుకున్న కొన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉండటంతో, ఈ విధానం అమలుచేస్తే వారి గాయాలు మరింత పెరిగిపోతాయని ఆమె



అంగీకరించారు. 2001లో ప్రధానిగా ఉన్న అటల్ బిహారి వాజ్‌పేయీ కూడా దీనికి ఇలాగే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన కూడా ఈ డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేసేందుకు ప్రయత్నించారు. ఆయన అభిప్రాయ ప్రకారం, దక్షిణాది రాష్ట్రాలు అనేక రంగాలలో అభివృద్ధిని సాధించడంతో, డీలిమిటేషన్ ప్రక్రియను వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్యాయం చేయకుండా నిర్వహించాల్సిన అవసరం ఉంది. 2026లో జరగబోయే డీలిమిటేషన్ ప్రక్రియ ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించడం, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయడం అనేది పెద్ద చర్చకు దారితీస్తుంది. ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సీట్లు పెరిగితే వారి రాజకీయశక్తి పెరుగుతుంది. కానీ దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గడంతో వారి ప్రభావం తగ్గిపోతుంది. ప్రజాస్వామ్యవాదులు ఈ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది దక్షిణాది రాష్ట్రాలను బలహీనపరిచి, ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రమే అధిక శక్తి ఇవ్వడం వల్ల రాజకీయ సమతుల్యతకు ముప్పు అని అంటున్నారు. తమిళనాడుకు సీట్లు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డీలిమిటేషన్ ద్వారా ఒక్క సీటు కూడా తగ్గబోదని చెప్పారు. కానీ, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ అమలు చేస్తే తమిళనాడుకు మరింత సీట్లు తగ్గే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోందిడీలిమిటేషన్ ప్రక్రియ ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయిస్తే, ఉత్తరాది ప్రాంతం దక్షిణాది మీద శాశ్వత ఆధిపత్యం ఏర్పడుతుందని ప్రజాస్వామ్యవాదులు హెచ్చరిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల ఓట్లు, సీట్లు పెరిగితే, దక్షిణాది రాష్ట్రాల ప్రభావం తగ్గి, దేశం ఏకపక్షంగా ఒకే పార్టీ ఆధీనంలో ఉండేలా మారవచ్చని విశ్లేషిస్తున్నారు. కొంత మంది బిజెపి హిందీ బెల్ట్‌లో పట్టు పెంచుకుంటుందని కూడా అభిప్రాయపడుతున్నారు. జనాభా ఆధారంగా జరిగిన డీలిమిటేషన్, బిజెపికి లాభం చేకూర్చే అవకాశం కల్పిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయింపుతో బిజెపి ఒకే పార్టీగా ఉత్తరాది రాష్ట్రాల్లో అధిక శక్తిని పొందవచ్చు. దీని వల్ల దక్షిణాది రాష్ట్రాలను నియంత్రించడం సులభమవుతుంది. ఇది భారతదేశ రాజకీయ వ్యవస్థలో పెద్ద మార్పును సూచిస్తుంది. ఈ డీలిమిటేషన్ ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తే, వాటి రాజకీయ శక్తి తగ్గిపోతుంది. దక్షిణాది రాష్ట్రాలు ఈ విషయంలో తీవ్ర పోరాటం చేయాలి, ప్రజల్లో చైతన్యం పెరిగి, సమర్థవంతమైన ప్రతిస్పందన ఇవ్వడం అవసరం. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటానికి కీలకమై ఉంటుంది. భారత దేశంలో రాజకీయాలు, ప్రజాస్వామ్యం, సమతుల్యతపై డీలిమిటేషన్ ప్రక్రియ అనేక ప్రశ్నలను తెస్తోంది. ఈ ప్రక్రియ అమలులోకి వచ్చినప్పుడు దక్షిణాది రాష్ట్రాలు మరింత బలహీనంగా మారే అవకాశం ఉంది. అలాగే ఉత్తరాది రాష్ట్రాలు అధిక శక్తిని పొందవచ్చు. దీనివల్ల భారత దేశంలో ఒక కొత్త రాజకీయ వ్యవస్థ ఏర్పడే అవకాశముంది. డీలిమిటేషన్ ప్రక్రియ భవిష్యత్తులో ఉత్తరాది- దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యతను భారీగా ప్రభావితం చేసే అవకాశం కలిగినది. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించడం, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాముఖ్యతను తగ్గించే దిశగా పని చేస్తుంది. ఈ పరిణామాల ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా ఉంటుంది. కనుక అవి ఈ అంశంపై తీవ్రం గా ఉద్యమించి, ప్రజలలో చైతన్యాన్ని పెంచుకోవడం అత్యంత అవసరమైంది.

# హామీలు అమలు చేయడంలో రేవంత్ విఫలం

హైదరాబాద్,ఎంతో ఆశతో కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లేసి గెలిపినందుకు సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి చేతకాక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు బీజేపీ నాయకులపై ఆరోపనలు చేస్తున్నారని రాష్ట్ర బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ నాగురావ్ నామాజీ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకుండా రాష్ట్రంలోనే నంబర్‌వన్ చీటర్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు 420 హామీలు ఇచ్చిన ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. అభివృద్ధి చేయడం చేతకాక కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదని అన్నారు. రాష్ట్రానికి కేంద్ర నిధులు లేకపోతే రాష్ట్ర అభివృద్ధి ఆగిపోతుందని తెలిపారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావివర్గం ఉపాధ్యాయులు, పట్టభద్రులు బీజేపీకి పట్టం కట్టారని నాగురావ్ నామాజీ అన్నారు. ఈ తీర్పు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టులా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డిది ఐరన్ లెగ్ అని ఆరోపించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా పాలమూరు ఎంపీగా బీజేపీ గెలిచిందని, రేవంత్ రెడ్డి ప్రాతినిథ్యం వహించిన మల్కాజ్‌గిరిలో బీజేపీ ఎంపీ గెలిచారని.. రేవంత్ రెడ్డి ప్రచారం చేసిన నిజామాబాద్-కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించిందని తెలిపారు. టీడీపీలో కొనసాగిన రేవంత్ రెడ్డి తెలంగాణలో టీడీపీని భూస్థాపితం చేశాడని.. ఇప్పుడు కాంగ్రెస్‌లో కొనసాగుతూ దాన్ని కూడా భూస్థాపితం చేస్తాడేమో అని అనుమానం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదని అన్నారు. నారాయణపేట పర్యటనలో భాగంగా ఆయనపై ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు తగవని అన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడ కాలు మోసి ప్రచారం చేసినా అక్కడ బీజేపీ విజయం సాధిస్తుందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి నీటి బుడగల ఉందని నాగురావ్ నామాజీ అన్నారు. పదవిని కాపాడుకునేందుకు ఢిల్లీకి చక్కర్లుకొడుతున్నాడే తప్ప నిధులు తీసుకురావడానికి ఢిల్లీకి వెళ్లడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని, కూలీలకు ఎందుకు డబ్బులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గ్రామీణ సడక్ యువజన కింద ప్రతి పల్లెకు బీటీ రోడ్ వేసిన ఘనత నరేంద్ర మోదీ ప్రభుత్వానిదే అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయిస్తున్నది మోదీ కాదా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిద్ధాంతాల కోసం పనిచేసే బీజేపీని విమర్శిస్తే ఎమ్మెల్సీ ఫలితాలు మేధావులు ఇచ్చిన తీర్పు చెంప చెల్లుమనేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు అదే తీర్పును పునరావృతం చేస్తారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని షాద్‌నగర్, జడ్చర్ల, గద్వాల్, మహబూబ్‌గర్ రైల్వే స్టేషన్లను విమానాశ్రయాల తరహాలో అభివృద్ధి చేస్తుందని నాగురావ్ నామాజీ తెలిపారు. వికారాబాద్ కృష్ణా రైల్వే లైన్ సర్వే పనులు పూర్తి కావడం జరిగిందని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అన్నారు. కేంద్రం నిధులు కేటాయించకుంటే రాష్ట్రంలో అభివృద్ధి మనుగడ లేకుండా పోతుందని తెలిపారు. అభివృద్ధికి అడ్డుపడుతున్నది కాంగ్రెస్ మంత్రులు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర నిధులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్నారని తెలిపారు. నారాయణపేటలో నిర్మిస్తున్న ఆసుపత్రి భవనానికి కేంద్రం 66 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి బీజేపీని విమర్శిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీజేపీని విమర్శించే ముందు రేవంత్ రెడ్డి తన స్థాయిని తెలుసుకోవాలని సూచించారు. పదవి ఆకాంక్షతో పూటకొక పార్టీ మారే రేవంత్ రెడ్డి బీజేపీని విమర్శించే స్థాయికి ఎదగలేదని అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే కేంద్ర నిధులపై చర్చకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో నారాయణపేట జిల్లా బిజెపి అధికార ప్రతినిధి నర్సన్ గౌడ్, జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, భాస్కర్ రెడ్డి, మరికల్ మండల పార్టీ అధ్యక్షుడు మంగలి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదనలో సగం మద్యానికే ఖర్చు..ఖజానాను ముంచుతున్న సబ్సిడీలు



విజయవాడ,కూలీనాలీ చేసుకునే పేదలు తమ డబ్బులో ముప్పావు వంతు మద్యానికే తగలేస్తున్నారు. మద్యం ధరలు పెరిగినా అమ్మకాలు తగ్గడం లేదు. కిలో రూపాయి బియ్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. సబ్సిడీ పథకాలకు ప్రజలను అలవాటు చేసి వారిని నిర్వీర్యులుగా చేయడం లో ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి. నగదు బదిలీ పథకాలు ఇబ్బడిముబ్బడిగా సాగుతున్నాయి. తమ సొంత ఖాజానా నుంచి ఇస్తున్నట్లుగా ప్రస్తుతం గ్రామాల్లో కూలీలు దొరకడం కష్టంగా మారింది. వ్యవసాయ కూలీల సంగతి చెప్పనక్కర్లేదు. జిఎస్టీతో ఆదాయం పెరిగిందని చంకలు గుద్దుకుంటున్న కేంద్రం దుబారా ఖర్చులు మాత్రం తగ్గించుకోవడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల పన్నులు కట్టలేక మధ్యతరగతి ప్రజల నడ్డి విరుగుతోంది. పన్నులు కట్టే ప్రజలకు జవాబుదారీ లేకుండాపోతోంది. ధరల విషయంలో పల్లెలకు పట్టణాలకు తేడా లేకుండా పోయింది. కూలీనాలీ చేసుకునే వారు కిక్కులేనిదే ఉండడం లేదు. దీంతో సంపాదించిన దాంట్లో అధిక భాగం తాగడానికే తగలేస్తున్నారు. ఉపాధిహామీ కింద నిర్మాణాత్మక పనులు చేయించాలన్న డిమాండ్‌పై కేంద్రం నిర్ణయాలు తీసుకోవడం లేదు. వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న వినతులను పక్కన పెట్టింది. ఉపాధి హామీకింద ఏటా వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నా పనికి వచ్చే పనులు జరగడం లేదు. దీనిని సమీక్షించాలన్న కనీస పరిజ్ఞానం కూడా ప్రభుత్వానికి కలగడం లేదు. దీంతో గ్రామాల్లో వ్యవసాయ కూలీలు కరువయ్యారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశంలో కూలీలు ఎందుకు దొరకడం లేదన్న ఆలోచన చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా రూపాయికే కిలో బియ్యం పథకాన్ని కొనసాగించడం సరికాదు. దీనిని తొలగించడం వల్ల వేలకోట్ల రూపాయల వృధాను అడ్డుకోవచ్చు. అయినా సమీక్షించడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సాహసిం చడం లేదు. రూపాయికి చాయ్ కూడా రాని రోజుల్లో ఇంకా ఈ పథకం కోసం వేలకోట్లు ప్రజల దనాన్ని దుబారా చేస్తున్నారు. ఈ బియ్యం పథకం ప్రభుత్వాలకు గుదిబండగా మారినా గంట కట్టేదెవరన్నది సాహసించడం లేదు. ఓట్లతో ముడిపడి ఉన్న ఈ పథకాన్ని తొలగించాల్సిందే. తెలుగు రాష్ట్రాల ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతున్న కిలో రూపాయి బియ్యాన్ని తక్షణం తొలగించడం ద్వారా ప్రజల సొమ్ముకు రక్షణగా నిలవాలి. ఆర్థిక మాంద్యంతో అతలా కుతలం అవుతున్న ప్రస్తుత తరుణంలో ఈ పథకంపై సమీక్షించి అక్రమాలను అరికట్టాలి. కొందరికి ఈ పథకం వరంగా మారింది. బియ్యాన్ని హోటళ్లకు అమ్ముకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. మరోవైపు కిలో రూపాయికే ఇస్తున్న చౌక బియ్యం అక్రమంగా రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్నాయి. పేదలు కడుపునిండా తినాలన్న ఈ పథకం ఇప్పుడు కొందరికి వ్యాపారంగా మారింది. మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. అలాగే రీసైక్లింగ్ పేరుతో సన్నబియ్యంగా మార్చి అమ్ముకునే వ్యాపారంగా మారింది. చెక్‌పోస్టులు,తనిఖీ కేంద్రాలు, పోలీసులు ఉన్నా బియ్యం రవాణాను అడ్డుకోలేకపోతున్నారు. ఎవరి స్థాయిలో వారికి మామూళ్లు అందుతుండటంతో వ్యాపారం జోరుగా సాగుతోందన్నది కఠోర సత్యం. ఫలితంగా పేదలపేరుతో సర్కార్ అందచేస్తున్న బియ్యం అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి. ఇక కొందరు ఈ బియ్యాన్ని అమ్ముకుని సన్నబియయం కొనుక్కుని తింటున్నారు. చాలామంది తెల్ల రేషన్ కార్డుదారులు ఈ బియ్యాన్ని అమ్ముకోవడానకే ఇష్టపడుతున్నారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పథకం అమలు సంగతి ఎలా ఉన్నా లక్ష్యం మాత్రం నీరుగారుతోంది. తద్వారా ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న నిధులు వృధా అవుతున్నాయి. ఇప్పటికే గ్యాస్ సబ్సిడీ తొలగించి నగదు బదిలీ చేపట్టింది కేంద్రం. దీంతో గ్యాస్ సబ్సిడీలో కొంతయినా అక్రమాలను అరికట్టగలిగారు. బియ్యం పథకం కోసం సబ్సిడీ రూపంలో వేలకోట్లతో పాటు పెద్ద యంత్రాంగం పనిచేయాల్సి వస్తోంది. ఇలాంటి దుబారాను అరికట్టి నిజమైన పేదలకు లబ్ది చేకూర్చేలా కార్యాచరణ చేయాలి. బియ్యం పథకాన్ని ఎత్తేసే ఆలోచన చేస్తే మంచిది. రూపాయికి విలువ లేని సమయంలో కిలో బియ్యాన్ని అందచేసి అక్రమాలకు తావీయకుండా దీనిని ఎప్పుడో తొలగించాల్సింది. రైతు బజార్లను పటిష్టం చేసి అక్కడే అన్ని సరకులను తక్కువ ధరలకు అమ్మితే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసినవారం అవుతాం. అంతేగాని రూపాయికే బియ్యం ఇచ్చి వృధాను ప్రోత్సహించడం ప్రభుత్వాలకు మంచిది కాదు. ఉమ్మడి ఎపిలో సబ్సిడీ బియ్యం ధరను పెంచినందుకు అప్పట్లో సిఎంగా ఉన్న చంద్రబాబుపై విమర్శలు చేశారు. ఆరోజుల్లోనే ఆయన దీనిని ఐదు రూపాయలకు పెంచారు. కానీ ఇప్పుడు రూపాయికే బియ్యం కావడంతో అక్రమ వ్యాపారానికి తెరతీసారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలకు బియ్యం సేకరణ తలకు మించిన భారంగా మారింది. జాతీయ భద్రత చట్టం కింద కొంత కేంద్రం సబ్సిడీ బియ్యాన్ని అందిస్తోంది. మిగిలిన లక్షల కార్డులకు పంపిణీ చేస్తున్న బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ భరించాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం పడుతోంది. ఇదంతా ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న సొమ్ము అని పాలకులు గుర్తించాలి. దీనిపై తోణం సమీక్షించి ధరలను పెంచడంతో పాటు, అక్రమాలను అరికట్టాలి. బయోమెట్రిక్ తీసుకుని వచ్చినా బియ్యాన్ని అమ్ముకుంటూనే ఉన్నారు.

# ముగిసినట్లేనా ?

విజయవాడ:దాదాపుగా అర్థ శతాబ్దం రాజకీయం ఆయన సొంతం. 1970 దశకం నుంచి రాజకీయాల్లో చురుకుగా పాలుపంచుకున్న ఆయనకు ఇపుడు రాజకీయంగా కంపల్సరీ రిటైర్మెంట్ ఎదురైందా అన్న చర్చ సాగుతోంది. రాజకీయాల్లో ఆ పెద్దాయన ఎవరో కాదు విజయనగరం పూసపాటి సంస్థానాధీశుడు కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు. ఆయన పూసపాటి రాజవంశీకుడు, కాంగ్రెస్ తొలితరం నాయకుడు అయిన పీవీజీ రాజు కుమారుడు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించడానికి జనతా పార్టీ ద్వారా అరంగేట్రం చేశారు 1977 ఎమర్జెన్సీ టైం నుంచే అశోక్ రాజకీయం స్టార్ట్ అయింది. అలా ఆయన 1978లో విజయనగరం అసెంబ్లీ సీటు నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచారు. 1983 నాటికి టీడీపీలో చేరి కీలకంగా మారారు. మంత్రిగా అనేక కీలక శాఖలను చూశారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడుగా సమకాలీనుడుగా టీడీపీలో అశోక్ ప్రభ ఒక వెలుగు వెలిగింది. ఆయన కేంద్ర మంత్రిగా కూడా నాలుగేళ్ళకు పైగా కేబినెట్ ర్యాంక్ తో పనిచేశారు. 2024లో ఆయనకు ఎంపీ టికెట్ దక్కలేదు. కుమార్తె అదితి గజపతిరాజుకు విజయనగరం అసెంబ్లీ సీటు ఇచ్చారు. ఆమె గెలిచారు. అయితే ఆనవాయితీ ప్రకారం అశోక్ కుటుంబానికి దక్కాల్సిన మంత్రి పదవి అయితే రాలేదు. ఇక ఎంపీగా పోటీ చేయని అశోక్ కి రాజ్యసభ సీటు ఇస్తారని అనుకున్నారు. ఆ విధంగా కొన్నాళ్ళ పాటు ప్రచారం సాగింది. కానీ అదేమీ లేదని తేలిపోయింది. ఇక కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కూడా ఉంది కాబట్టి టీడీపీ కోటాలో దక్కే గవర్నర్ పోస్టుకు అశోక్ గజపతి రాజు పేరుని పరిశీలిస్తారు అని కూడా అనుకున్నారు. కానీ అదేమీ జరగలేదు. దాంతో రాజు గారు పూర్తిగా వైరాగ్యంలోకి వెళ్ళారని అంటున్నారు. ఆయన ఎక్కువ సమయం హైదరాబాద్ లోనే గడుపుతున్నారని అంటున్నారు. ఆయన తన కుమార్తెకు రాజకీయ సలహాలు ఇస్తూ ఆమెను మంచి లీడర్ గా చేసే ప్రయత్నంలో ఉన్నారు. మరో విషయం ఏంటి అంటే ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక అశోక్ పెద్దగా అధినాయకత్వాన్ని కలిసింది లేదని అంటున్నారు. ఆయనకు పదవులు వాటంత అవే దక్కాయి. ఆయన ఏ రోజూ వాటిని కోరుకోలేదని అంటున్నారు. ఇక రాజకీయంగా ఎంతో సీనియర్ అయి ఉండి టీడీపీకి సుదీర్ఘ కాలం సేవ చేసిన నేతగా అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి దక్కితే చూడాలని అభిమానులు ఆశిస్తున్నారు. అలా కాకున్నా ఆయన మేధస్సుకు తగిన స్థానంగా రాజ్యసభలో అయినా ఉంచాలని అంటున్నారు. అయితే తెలుగుదేశంలో కొత్త పోకడలు చోటు చేసుకున్నాయని అంటున్నారు. కొత్త వారికి యువతకు పెద్ద పీట వేస్తున్నారు. సీనియర్లను పక్కన పెడుతున్నారు. దాంతో ఏడు పదులు దాటిన అశోక్ లాంటి వారికి అవకాశాలు ఇవ్వాలనుకుంటేనే ఇస్తారు. లేదా పార్టీ పాలసీ ప్రకారం ముందుకు పోతారని అంటున్నారు. ఈ విషయాలను అన్నీ గమనించిన మీదటనే అశోక్ గజపతిరాజు మౌన ముద్రలో ఉంటున్నారు అని అంటున్నారు. ఈ రాజకీయ జీవితానికి ఇక్కడితో ఫుల్ స్టాప్ అని ఆయనకు ఆయనే పెట్టేసుకున్నారా

# మహిళల రక్షణకు పటిష్ట చర్యలు




హైదరాబాద్, ఇప్పుడు ఎక్కువగా సైబర్ క్రైమ్ ఫ్రాడ్ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్నాయి. కాబట్టి ప్రతి ఒక్క మహిళ కూడా జాగ్రత్తగా ఉండాలని ఏదైనా సమస్య వస్తే వెంటనే మా వాట్సాప్ నెంబర్ కి మెసేజ్ చేయండి... ఇప్పుడు మహిళలకు అండగా ఉంటుందని భరోసా ఇస్తున్నారు.తెలంగాణలో మహిళల రక్షణకు షీ టీమ్స్ ఏర్పాటు చేశాక మంచి ఫలితాలు వస్తున్నాయి. మహిళలకు అండగా అవి బాగా పనిచేస్తున్నాయి. మహిళా దినోత్సవం సందర్భంగా అనేక కార్యక్రమాలతో చైతన్యం చేపట్టారు. ఎపిలోనూ మహిళా శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకుని వస్తామని హోంమంత్రి అనిత ప్రకటించారు. గతంతో పోలిస్తే మహిళల రోణ విషయంలో ప్రభుత్వం కఠినంగానే వ్యవహరిస్తోంది. అయితే దేశవ్యాప్తంగా ఒకే తరహా కఠిన చట్టాలు రావాలి. అప్పుడే ప్రజల్లో భయం నెలకొంటుంది. ఇకపోతే షీ టీమ్స్ ఏర్పాటు చేసినప్పుడు దీనిని బలోపేతం చేసి మహిళలకు అండగా నిలవడంలో ఐపిఎస్ అధికారి స్వాతి లక్రా కృషి ప్రశంసనీయం. సిటీ పోలీస్ తరపున షీటీమ్స్ బాగా పనిచేయడంతో అనేక రాష్ట్రాల్లో దీనిని విస్తరించారు. ఇదో రకంగా తెలంగాణ షీ టీమ్స్‌కు దక్కిన గౌరవంగా చూడాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు చేపట్టారు. షీటీమ్స్ ఏర్పడినందున వారి పాత్రను,కృషిని అభినందించాల్సిందే. ఎన్నో క్లిష్లమైన సమస్యలను, కేసులను పరిష్కరించడంతో పాటు..మహిళలకు తామున్నామన్న భరోసా ఇవ్వడంలో షీ టీమ్స్ విజయం సాధించాయి. డయల్ 100, మహిళా భద్రత, షీ టీమ్స్ గురించి అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించారు. ఉమెన్ సేఫ్టీ విషయంలో అనేక చర్యలు తీసుకున్నారు. మహిళలను వేధించినా లేదా రేప్ కేసుల్లో నిందితులకు శిక్ష ఖరారు చేయించడంలో షీటీమ్స్ కీలక భూమిక పోషించాయి. యువతులు, మహిళలు ఇక నగరంలో నిర్భయంగా ఉండొచ్చన్న భరోసా దక్కడంలో ఈ టీమ్స్ బాగా కృషి చేస్తున్నాయి. వారికి అండగా, రక్షణగా 'షి' బృందాలను ఏర్పాటు చేసి వారి భద్రతకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగేసింది. జగన్ హయాంలో మహిళల కోసం ప్రత్యేక పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసినా లితంలేకుండా పోయింది. ప్రధానంగా మహిళల పట్ల సమాజంలో మార్పు వస్తేనే ఇది సాధ్యం. బస్టాపులు, రైల్వేస్టేషన్లు, ఆటోస్టాండ్ల వద్ద, కళాశాలల వద్ద నిఘా వేస్తారు. మహిళలను వేధింపులకు గురి చేసిన వారిని తక్షణమే అదుపులోకి తీసుకుంటున్నారు. ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 100కు ఫోన్ చేస్తే తక్షణ సాయం అందిస్తామని స్వాతిలక్రా మహిళలకు సూచించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతూ షి బృందాలకు పట్టుబడిన వారు జాగ్రత్తగా ఉండకపోతే వారిపై క్రైమ్‌షీట్ తెరుస్తారు. ఆ వివరాలు అన్ని పోలీస్‌స్టేషన్లలో అందుబాటులో ఉండేలా సెంట్రల్ డేటాలో పొందుపరుస్తారు. ఈవ్‌టీజర్ల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తారు. చట్ట ప్రకారం శిక్షించడమే కాకుండా, మళ్లీ పట్టుబడితే నిర్భయ కేసును నమోదు చేస్తారు. ఈవ్‌టీజర్లపై నిర్భయంగా ఫిర్యాదు చేయొచ్చని, ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఆకతాయిల చేష్టలకు చెక్ పెట్టేందుకు ఏర్పాటు చేసిన షీ టీమ్స్ వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోంది. నమోదైన కేసులే ఇందుకు ఉదాహరణ. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం వారి రక్షణ కోసం షీ టీమ్స్‌ని 2018లో ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆడవాళ్లపై వేధింపులకు పాల్పడే వారిని ఊపేక్షించ కుండా వారిపై కేసులు నమోదు చేస్తోంది ఈ మహిళ రక్షణ వ్యవస్థ. షీ టీమ్స్ ఇలాంటి కేసుల్లో పేరెంట్స్‌కి కౌన్సిలింగ్ ఇవ్వడంతో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చిందే తడవు... ఆకతాయిలు, పోకిరీలను అరెస్ట్ చేసింది షీ టీమ్స్ వ్యవస్థ. ఎవరైనా వేధిస్తే గతంలో పోలీస్ కంప్లైంట్ ఇవ్వడానికి మహిళలు ముందుకొచ్చే వాళ్లు కాదని,కాని ఆన్‌లైన్‌లో, వెబ్ సైట్ ద్వారా అవగాహన కల్పించడంతో ఫిర్యాదులు చేయడానికి ధైర్యంగా ముందు కొస్తున్నారు.

# రాజకీయంగా మళ్లీ క్రియాశీలం.. అయినా ఫామ్ హౌస్ కే పరిమితం!

హైదరాబాద్,తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎట్టకేలకు రాజకీయంగా మళ్లీ క్రియాశీలం అవుతున్నారు. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమి పాలై.. అధికారానికి దూరమైన క్షణం నుంచీ కేసీఆర్ దాదాపుగా రాజకీయ సన్యాసం పుచ్చుకున్నారా అనే విధంగా యాక్టివ్ పోలిటిక్స్ కు దాదాపు దూరమయ్యారు. పూర్తిగా ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. అడపదడపా పార్టీ నేతలను ఎవరినైనా కలిసినా వారిని ఫామ్ హౌస్ కు పిలిపించుకుని మాట్లాడారే తప్ప ఆ ఫామ్ హౌస్ వీడి బయటకు రాలేదు. పార్టీ పరాజయం పాలైన తరువాత ఇప్పటి వరకూ ఆయన ఫామ్ హౌస్ వీడి బయటకు వచ్చిన సందర్భాలను వేళ్ల మీద లెక్కించవచ్చు. ఒక సారి అంటే ఒకే ఒక రోజు అసెంబ్లీకి హాజరయ్యారు. అసెంబ్లీలో ఆయన నోరెత్తింది లేదు. బయటకు వచ్చి మీడియాతో ముక్త సరిగా రెండు మాటలు మాట్లాడి మళ్లీ ఫామ్ హౌస్ కు వెళ్లిపోయారు. తాజాగా ఇటీవల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు ఫామ్ హౌస్ వీడి తెలంగాణ భవన్ కు వచ్చారు. అక్కడా అంతే ప్రసంగం ముగించేసి మళ్లీ ఫామ్ హౌస్ కు చేరిపోయారు. ఇక ఇప్పుడు తాజాగా ఆయన పార్టీ ముఖ్యులతో సమావేశమయ్యారు. అయితే ఆ సమావేశం కోసం కేసీఆర్ బయటకు రాలేదు. పార్టీ నేతలనే ఫామ్ హౌస్ కు పిలిపించుకున్నారు. ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీకి పార్టీ దూరంగా ఉండటం, అనూహ్యంగా బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడంతో రాజకీయంగా బీఆర్ఎస్ కథ ఇక ముగిసినట్లేనన్న విశ్లేషణలు వెల్లువెత్తుతున్న సమయంలో కేసీఆర్ పార్టీ నేతలతో భేటీ అవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఆయన తెలంగాణ భవన్ కు రాకుండా నేతలను ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు పిలిపించుకుని మాట్లాడటమే పార్టీ వర్గాలలో ఒకింత అసంతృప్తికి కారణమయ్యింది. ఈ విషయాన్ని పార్టీ నేతలే ప్రైవేటు సంభాషణల్లో చెప్పుకుంటున్నారు. అసలు ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీని పోటీకి దూరం పెట్టడమే



ఒక రాజకీయతప్పుదమన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. హరీష్ రావు వంటి సీనియర్ నాయకుడు ఈ విషయాన్ని నేరుగా కేసీఆర్ కే చెప్పి.. పార్టీ తరఫున అభ్యర్థిని రంగంలోకి దింపుదామని కోరినప్పటికీ కేసీఆర్ వినలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పోటీకి దూరం కావడం వల్ల బీఆర్ఎస్ బీజేపీకి బీ టీమ్ అన్న విమర్శలకు, ఆరోపణలకు బలం చేకూర్చినట్లు అవుతుందని ఎంతగా చెప్పినప్పటికీ కేసీఆర్ పట్టించుకోలేదని అంటున్నారు. సరే మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికలలో రెండు బీజేపీ గెలుచుకోవడంతో రాష్ట్రంలో బీఆర్ఎస్ పొలిటికల్ స్పేస్ ను బీజేపీ ఆక్రమించేసిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఈ తరుణంలో కేసీఆర్ ఫామ్ హౌస్ లో పార్టీ నేతలలో జరిపిన భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ ఎంపీలు హాజరయ్యారు. అంతా బానే ఉన్నా.. కేసీఆర్ ఈ సమావేశాన్ని తన ఫామ్ హౌస్ లో ఏర్పాటు చేయడం పట్ల మాత్రం బీఆర్ఎస్ నేతలలో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఇలా ఫామ్ హౌస్ లో భేటీల వల్ల ప్రజల దృష్టిలో పలుచన అవుతామన్న ఆందోళనా వారు వ్యక్తం చేస్తున్నారు.

# పసుపు ధరలపై రైతుల ఆందోళన,,గిట్టుబాటు ధరల కోసం చూపు



నిజామాబాద్,నిజామాబాద్ పసుపు మార్కెట్‌లో ధరలు దక్కడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పసుపు బోర్డు ప్రకటించినా అది పూర్తిస్తాయిలో తనపనిని చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఎగుమతులు పెరుగుతున్నాయని, తొందరపడి అమ్ముకోవద్దని సూచించారు. పసుపుబోర్డుతో మేలు జరుగుతుందని అన్నారు. అయితే నిజామాబాద్ జిల్లాతోపాటు జగిత్యాల, నిర్మల్ జిల్లాల నుంచి వేల పసుపు బస్తాలను తీసుకొస్తున్న రైతుల సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారు. మద్ధతు ధర, ఇతర సమస్యను తీర్చేవారే కరువయ్యారు. పసుపు రైతులను ఏళ్ల తరబడి ఎన్నికలకు అస్త్రాలుగా వాడుకొని లబ్ది పొందిన నేతలు పసుపు ధరపై పట్టించుకోవడం లేదు. నిజామాబాద్ మార్కెట్ లో పసుపు ధర రోజురోజుకూ తగ్గుతోంది. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న రైతులకు ఈ యేడు వచ్చినంత తక్కువగా ఏ సంవత్సరం రాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు కొనుగోళ్లపై దృష్టి సారించకపోవడం వల్ల ధర పెరగలేదు. జాతీయ, అంతర్జాతీయ ప రిస్థితుల నేపథ్యంలో వ్యాపారులు ఒడిదొడు కులను, పాత స్టాక్‌ను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు చేస్తున్నారు. గత సంవత్సరం కంటే తక్కువ ధరకు పసుపు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. భారీగా పసుపు వచ్చిన ధర మాత్రం మారడంలేదు. పసుపునకు మద్దతు ధర కల్పిస్తాం అని ఏళ్ల తరబడి వాగ్దానాలు చేస్తున్నా ధరలు మాత్రం రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ధర నిర్ణయిస్తే తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. ఈ అయిదేళ్లలో పసుపు ధర భారీగా తగ్గింది. కూలీలు, ధరలు, ఎరువులు, ఇతర రసాయనాల ధరలు పెరిగాయి. రైతులకు మ్యాచింగ్ గ్రాంట్‌లాగా నిధులను విడుదల చేసి పసుపు రైతులకు ఇవ్వాలని కోరుతున్నారు.

# మద్యనిషేధంపై మాట్లాడే హక్కు మీకెక్కడిది

అమరావతి, మద్య నిషేధంపై మాట్లాడే హక్కు వైసీపీ నేతలకు లేదు అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గతంలో నాసిరకం మద్యంతో చాలా మంది అనారోగ్యానికి గురయ్యారని, జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 42 మంది మరణించారన్నారు. బెల్టు దుకాణాలపై తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, నాసిరకమైన 29 మద్యం బ్రాండ్ల అమ్మకాలను నిలిపివేశాం అని తెలిపారు. తాగేవాళ్లను ఒక్కసారిగా మార్చలేమని, ఇది క్రమేపీ జరగాల్సిన పక్రియ అని మంత్రి పేర్కొన్నారు. శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీల ప్రశ్నలకు మంత్రి కొల్లు రవీంద్ర సమాధానం ఇచ్చారు.'గత ప్రభుత్వ హయాంలో లిక్కర్ తాగి చాలామంది చనిపోయారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 42 మంది మరణించారు. గతంలో మద్య నిషేధంపై మీ నాయకుడితో మాట్లాడారా?. మద్యంపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు. మద్యపాన నిషేదం చేస్తామని చెప్పి చేశారా?. దశల వారీగా మారుస్తామన్నారు? మార్చారా?. మద్యం షాపులు తాకట్టు పెట్టి అప్పులు కూడా తెచ్చారు. బెల్టు దుకాణాలపై మా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. నాసిరకమైన 29 మద్యం బ్రాండ్ల అమ్మకాలను నిలిపివేశాం. తాగేవాళ్లను ఒక్కసారిగా మార్చలేము..



ఇది క్రమేపీ జరగాల్సిన పక్రియ' అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.త ప్రభుత్వంలో 66,967 బెల్టు షాపులు ఉండేవని ఆయన చెప్పారు. మద్య నిషేధంపై మాట్లాడే హక్కు వైకాపా నేతలకు లేదన్నారు. గతంలో నాసిరకం మద్యం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం దోపిడీపై దర్యాప్తు జరుగుతోంది' అని కొల్లు రవీంద్ర చెప్పారు.

# కాంగ్రెస్ కోరి తెచ్చుకున్న ఓటమి!

హైదరాబాద్,జో జీతేగా ఓయీ సిఖందర్.. గెలిచినవాడే రాజు, ఏమి చేశారు, ఎలా గెలిచారు, అనేది తర్వాత చర్చ. తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎనికల్లో బీజేపీ రెండు స్థానాలు గెలుచుకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంతో పాటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కమల దళం తమ ఖాతాలో కలుపుకుంది.మూడింట రెండు ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ గెలుచుకోవడం సహజంగానే బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా, కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కరీంనగర్ పట్టభద్రుల సీటును బీజేపీ కైవసం చేసుకోవడం, బీజేపీలో జోష్ పెంచింది. కాంగ్రెస్ ను కృంగదీసింది. మరోవంక ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర రాజకీయ సమీకరణలలోమార్పు మొదలైందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, బీజేపీ, బీజేపీ అనుకూల మీడియా మేథావులు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు మార్పునకు సంకేతంగా భావిస్తుంటే.. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందమే, తమ ఓటమికి కారణమని కాంగ్రెస్ నాయకులు.. సామాన్య ప్రజలపై ఓటమి ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఒక విధంగా ఇది పరవు నిలుపుకునే ప్రయత్నం. బీజేపీ దూకుడుకు బ్రేకులు వేసే ప్రయత్నం. మరోవంక, రాష్ట్ర బీజేపీ నాయకులు అయితే, చిటారు కొమ్మన మిఠాయి పొట్లం చేతికి అందినట్లే సంబర పడి పోతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మొదలు బీజేపీ రాష్ట్ర నాయకులు రాష్ట్రంలో నెక్స్ట్ వచ్చేది మా ప్రభుత్వం అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం ప్రారంభమైందని సంబర పడి పోతున్నారు. అదే సమయంలో రహస్య పొత్తులు, లోపాయికారీ ఒప్పదాల పై చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ బరిలో నిలవక పోవడం, బీఎస్పీ బరిలో నిలవడం కమల దళానికి ఉభయ తారకంగా కలిసొచ్చిన అంశాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అలాగే కాంగ్రెస్ నాయకుల మధ్య సమన్వయ లోపం, అభ్యర్థిని ప్రకటించడంలో జాప్యం, ఇలా కాంగ్రెస్ ఓటమికి చాలానే కారణాలు ఉన్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అదెలా ఉన్నా.. బీజేపీ అనుసరిస్తున్న నూతన ప్రచార వ్యూహం, ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు నిబద్ధతతో సాగించిన ప్రచారం కమల దళానికి కలిసొచ్చిందని అంటున్నారు. అవును రాజకీయ అనుబంధ బాంధవ్యాలతో సంబంధం లేకుండా, రాజకీయ విశ్లేషకులు అందరూ ప్రశంస పుర్వకంగానో, ఆందోళన పూర్వకంగానో కాషాయ బీజేపీ క్యాడర్ కమిట్మెంట్ ను మెచ్చుకుంటున్నారు. చివరకు పార్టీని సైద్ధాంతికంగా వ్యతిరేకించే వామపక్ష మేధావులు సైతం బీజేపే క్యాడర్ ఐడిలాజికల్ కమిట్మెంట్'తో పనిచేయడం వల్లనే బీజేపీ మూడింట రెండు సీట్లు గెల్చుకుందని అంగీకరిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రణాళిక బద్ధంగా పార్టీ కార్యకర్తలు చేసిన ప్రచారం, బీజేపీ గెలుపునకు ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. అంతే కాదు, కమిట్మెంట్ తో పనిచేసే క్యాడర్ బీజేపీ అసలు బలంగా విశ్లేషకులు గుర్తిస్తున్నారు. మరోవంక కాంగ్రెస్



పార్టీలో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం లేక పోవడంతో చే చేతులా గెలుపును చేజార్చుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిజానికి కాంగ్రెస్ అభ్యర్థి నరేంద్ర రెడ్డి, ఆరు నెలల ముందు నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నారు. కొత్త ఓటర్లను చాలా పెద్ద సంఖ్యలో చేర్పించారు.అలాగే కాంగ్రెస్ టికెట్ ఆశించి చివరకు బీఎస్పీ అభ్యర్థిగా బరిలో దిగిన ప్రసన్న హరికృష్ణ కూడా ముందు నుంచి క్షేత్ర స్థాయిలో పని చేశారు. అయితే చివరికి టికెట్ రాక పోవడంతో ఆయన బీఎస్పీ టికె పై పోటీకి దిగి, బీజేపీ అభ్యర్థి గెలుపునకు పరోక్షంగా సహకరించారు. నిజానికి కాంగ్రెస్ నాయకత్వం హరికృష్ణ, నరేంద్ర రెడ్డి మధ్య సయోధ్య కుదిర్చి ఒకరే బరిలో నిలిచేలా చేసుంటే, కాంగ్రెస్ విజయం నల్లేరు మీద నడకలా సాగేది. అందుకే కాంగ్రెస్ ఓటమికి ఇంకా అనేక కారణాలు ఉన్నా, నాయకుల మధ్య సమన్వయ లేకపోవడం, క్యాడర్ లో ఉత్సాహం, కమిట్మెంట్ లేక పోవడం కాంగ్రెస్ ఓటమికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరో విషయమేంటంటే.. పార్టీ రాష్ట్ర స్థాయి నాయకత్వం గెలుపు పై అంతగా దృష్టి పెట్టలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కానీ చివరకు, శుభం పలకరా .. పెద్దన్నా అంటే కాంగ్రెస్ అభ్యర్థి నరేంద్ర రెడ్డి ఓడిపోయినా తమ ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదన్న చక్కటి సందేశం ఇచ్చివచ్చారు. పీసీసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నాయకులకు దిశా నిర్దేశం చేయడంలో శ్రద్ధ చూపలేదు.పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోని ఆ నాలుగు జిల్లాలో కేవలం నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్న బీజేపీ కార్యకర్తలను కలుపుకుని గెలుపే లక్ష్యంగా ప్రచారం సాగిస్తే.. కాంగ్రెస్ పార్టీకి 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నా క్యాడర్ ను సక్రమంగా ఉపయోగించుకోలేదని అంటున్నారు. నిజానికి కాంగ్రెస్ అభ్యర్థి నరేంద్ర రెడ్డి కూడా ఇంచుమించుగా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. పరోక్షంగానే అయినా క్షేత్ర స్థాయిలో తాను ఒంటరి పోరాటం చేయవలసి వచ్చిందనే ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ విధంగా చూసినప్పుడు ఇదొక రకంగా కాంగ్రెస్ పార్టీ కోరి తెచ్చుకున్న ఓటమి .. బీజేపీ పోరాడి సాధించిన విజయం అంటున్నారు.

# 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



హైదరాబాద్: తొలి రోజు ఉదయం పదకొండు గంటలకు సభ ప్రారంభమవుతుంది. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. ఈ మేరకు శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు శుక్రవారం నోటికేషన్ జారీ చేశారు. ఇదిలావుండగా గురువారం రాత్రి జరిగిన మంత్రి వర్గ సమావేశంలో బడ్జెట్ సమావేశాలను ఈ నెల 12 నుంచి 27 వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. 12న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమై 13న సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఆ మరుసటి రోజు 14న హెూలీ పం డుగ సెలవు దినం కావడంతో ఈ నెల 15 శనివారం బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయా, లేక శని, ఆదివారాలు సెలవు దినాలు మినహాయించి సోమవారం 17 నుంచి నిరవధికంగా జరుగుతాయా అనేడి తెలియాల్సి ఉంది.

# ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ కావాలి

హైదరాబాద్,ఓట్ల కోసం పథకాలు కాకుండా క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. అందుకు క్రీడా పాలసీని ప్రకటించాలి. మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేసేందుకు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం కనీసం ఇప్పటి నుంచయినా ప్రయత్నించాలి. బాల్యంలోనే క్రీడాంశాలపై మక్కువ కల్పించి ప్రత్యేక స్పోర్ట్స్ స్కూళ్లను తెలవాలి. అందుకు ఎంత ఖర్చయినా వెరవకుండా ముందుకు సాగాలి. ఇవాళ ఇంట్లో ప్రతి మగపిల్లాడికి బ్యాట్ పట్టడం తప్ప మరో క్రీడ తెలియకుండా పోతోంది. క్రికెట్ మాత్రమే కాదు.. బ్యాడ్మింటన్ సహా అనేక ఆటలు ఉన్నా యన్న సంగతి ముందుగా తెలియ చెప్పాలి. మన ఒకప్పుడు హాకీ క్రికెట్ కంటే మిన్నగా అభిమానుల ఆదరణకు నోచుకుంది కానీ.. తర్వాత భారత జట్టు ప్రదర్శన లాగే దానికున్న ఆదరణా పడిపోయింది. అది మన జాతీయ క్రీడ అయినా దానిని పక్కన పెట్టేశాం. హాకీతో పాటు మిగతా ఆటలన్నీ కూడా ఉన్నా వాటిని ఆదరించుకోవడం లేదు. నిరాదరణ కారణంగానే కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర క్రీడలన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రైవేట్ ప్రోత్సాహంతో సింధులాంటి వాళ్లు షటిల్ బ్యాడ్మింటన్ పట్టల మక్కువ పెంచుకోవడంతో ఇప్పుడు దీనికి ఆదరణ పెరగగలదు. గత కొన్నేళ్లలో బ్యాడ్మింటన్ అంచెలంచెలుగా ఎదిగి, ఆదరణ పెంచుకుని.. ఇప్పుడు దేశంలో లక్షల మంది ఆ ఆట ఆడేందుకు ముందుకొచ్చేలా.. కోట్ల మంది కీలక మ్యాచ్‌లను వీక్షించేలా చేయగలిగింది. ఇందులో పుల్లెల గోపీచంద్ పాత్ర అత్యంత కీలకం. బ్యాడ్మింటన్ బంగారు భవిష్యత్తుకు గట్టి పునాది వేశాడు గోపీచంద్. అతను నెలకొల్పిన అకాడమీ ఇప్పుడిప్పుడే వేళ్లూను కుంటోంది. దేశంలో బ్యాడ్మింటన్ ముఖచిత్రాన్నే మార్చేసిన ఘనత



గోపీచంద్‌ది. ద్రోణాచార్య లాగా తర్ఫీదు ఇచ్చి మెరికల్లాంటి షటిలర్లను తయారు చేస్తున్నాడు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ గొప్ప పురోగతి సాధించింది. ఇప్పటికే ఆడేందుకు, చూసేందుకు మంచి ప్రత్యామ్నాయంగా మారిన బ్యాడ్మింటన్‌పై ఆసక్తి రెట్టింపవుతుందనడంలో సందేహం లేదు. అయితే ఈ స్ఫూర్తి కొనసాగాలంటే, మరిన్ని పతకాలు రావాలంటే ప్రభుత్వాల క్రీడా విధానాంలో మార్పుల రావాలి. కోచ్‌లను,క్రీడాకారులను ప్రోత్సహించాలి. అందుకే చైనా తరహాలో భారత్ ప్రభుత్వం కూడా క్రీడలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధంగా తయారవ్వాలి. సింధు మ్యాచ్‌లను చూసినప్పుడు కలిగిన అనుభూతి ఇప్పుడు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి నింపుతుందనడంలో సందేహం లేదు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com